# ప్రజా మార్పు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




బాసర జ్ఞాన సరస్వతి ఆలయం ప్రాంగణంలో..
అమ్మవారి కిరీటం, హుండీ చోరీ


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 316 పేజిలు : 04 వెల రూ. 2 బుధవారం 24 - 06 - 2026


# హైదరాబాద్ మెట్రోపై

# కేంద్రమంత్రులతో చర్చలు ఫలప్రదం

- ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్ నియామకం
- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చలు ఫలప్రదం
- మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్
- కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ



**హైదరాబాద్ :**

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- 1 వాల్యుయేషన్, ఫేజ్-1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్రమంత్రులు, సీఎం ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐ క్యాప్స్‌ను ఎంపిక చేశారు.మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ, ఇతర అంశాలపై ఎస్బీఐ క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా - మిగతా 2 లో

## లక్ష ఇళ్ల నిర్మాణ పథకానికి

## పేరు సూచిస్తే లక్ష రివార్డ్





- తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్
- హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి భారీ పథకం
- పథకానికి మంచి పేరు సూచిస్తే లక్ష రూపాయల నగదు బహుమతి
- తెలంగాణ హౌసింగ్ బోర్డ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సూచనలు పంపాలి
- జూన్ 28వ తేదీ తుది గడువు

**హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో ప్రతిపాదిత భారీ గృహ నిర్మాణ పథకానికి ఆకర్షణీయమైన పేరును సూచించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను కోరుతోంది. ఈ పథకానికి అత్యుత్తమ పేరును సూచించిన విజేతకు తెలంగాణ గృహనిర్మాణ సంస్థ (టీజీహెచ్‌బీ) రూ. లక్ష నగదు బహుమతిని ప్రకటించింది.ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) - మిగతా 2 లో



## ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక స్కాం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్
- సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ

**హైదరాబాద్ :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల - మిగతా 2 లో

## పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్


- రాష్ట్రపతి భవన్ వేదికగా అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్
- కార్యక్రమానికి హాజరైన మోదీ, అమిత్ షా



**ఢిల్లీ :**

మన తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జాతీయ స్థాయిలో మరోసారి గర్వించదగ్గ గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు అత్యంత వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేశారు. ఈ విడతలో మొత్తం 47 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేయగా.. అందులో మన టాలీవుడ్ లెజెండ్స్ ఉండటం విశేషం.నాలుగు - మిగతా 2 లో

## 'సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు'



- సింధూ జలాల వివాదంపై పాక్‌కు భారత్ గట్టి కౌంటర్
- పీఓకేలో ఆందోళనల వెనక భారత్ హస్తం ఉందన్న వ్యాఖ్యలను తోసిపుచ్చిన భారత్
- పాక్ అనుసరిస్తున్న విధానాలే పీఓకేలో ఆందోళనలకు కారణమని వ్యాఖ్య
- దోపిడీ, అణచివేతకు పాల్పడటం వల్లే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారన్న రణధీర్ జైస్వాల్

**ఢిల్లీ :**

పాకిస్థాన్ జల భద్రతకు ముప్పు వాటిల్లితే భారత్‌పై యుద్ధానికి దిగుతామని పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన వ్యాఖ్యలకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. పాకిస్థాన్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంతో పాటు మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి అంతర్జాతీయ దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తోందని విమర్శించింది. అలాగే, పాక్ అక్రమిత కశ్మీర్‌లో జరుగుతున్న ఆందోళనల వెనక భారత్ హస్తం ఉందన్న - మిగతా 2 లో





## జులై 5 నుంచి నిరవధిక నిరాహార దీక్ష

- మహారాష్ట్ర ఆర్టీఐ నిబంధనల సవరణలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- ఫీజుల పెంపు, ఐడీ ప్రూఫ్ తప్పనిసరి చేయడంపై అభ్యంతరం
- 'ఒక దరఖాస్తు-ఒక అంశం' నిబంధనను వ్యతిరేకించిన హజారే


ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షల సడలింపు

## భారత్‌కు భారీ ఊరట!

- ఆగస్టు 21 వరకు 60 రోజుల పాటు చమురు అమ్మకాలకు అనుమతి
- ఈ నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లో తగ్గిన ముడి చమురు ధరలు
- భారత్‌కు రష్యా, గల్ఫ్ దేశాలపై ఆధారపడటం తగ్గించుకునే అవకాశం
- హర్మూజ్ జలసంధిలో భద్రత పెరగడం భారత్‌కు వ్యూహాత్మకంగా కలిసొచ్చే అంశం









## విశాఖ పరిశ్రమలపై పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు



- విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం, ఇద్దరు కార్మికుల మృతి
- పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని పవన్ ఆదేశం
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

**విశాఖపట్నం :**

విశాఖపట్నం సమీపంలోని అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మా సిటీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పరిశ్రమల్లో తక్షణమే భద్రతా తనిఖీలు (సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.పరవాడ మండలం, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని 'దక్షినా ఎనర్జీ' కెమికల్ - మిగతా 2 లో

# ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62కు పెంపు

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
- రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు
- రూ.34 వేల కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం
- సుమారు 35 వేల ఉద్యోగాల కల్పనకు గ్రీన్ సిగ్నల్
- దాదాపు 80కు పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపిన కేబినెట్



**అమరావతి :**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34,000ల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35,000ల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన నిర్ణయాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం దాదాపు 80కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. అమరావతి పరిధిలోని ఉండవల్లి ప్రాంతంలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో 5 స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదించింది.విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ - మిగతా 2 లో

ప్రజా మాటల
బుధవారం 24 - 06 - 2026

# సంపాదకీయం

## నడకదారి ఇక పౌరుల హక్కు



నగరాలు, పట్టణాలు, పల్లెటూళ్లన్న తేడా లేకుండా ఇకపై ప్రతి రహదారికీ పాదచారులు నడవటానికి వీలుగా ఫుట్‌పాత్‌లు ఉండి తీరాలనీ, ఇందుకు సంబంధించి ఒక చట్టం తీసుకురావాలనీ సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఇచ్చిన ఆదేశం పౌరులకు ఉపశ మనం కలిగిస్తుంది. ఈ తీర్పు ప్రాముఖ్యతేమంటే... జీవించే హక్కుకు పూచీపడుతున్న రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని, దాంతోపాటు దేశంలో ఎక్కడికైనా వెళ్లే, స్థిరపడే, కలుసుకునే స్వేచ్ఛను వాగ్దానంచేసే అధికరణం 19(1) (ఎ), (బి), (సి), (డి)లను మరింత విస్తృతీకరించటం. దీని పర్యవసానంగా రోడ్లపక్కన ఫుట్‌పాత్‌లుండటం ఇకపై పౌరుల ప్రాథమిక హక్కుల్లో ఒకటవుతుంది. అయితే ఈ ఆదేశాలిచ్చే ముందు అసలు ఎన్ని నగరాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో ఫుట్‌పాత్‌లున్నాయో... వాటిల్లో ఎన్ని పనికొచ్చే విధంగా ఉన్నాయో గణాంకాలివ్వాలని ధర్మాసనం రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతా లను ఆదేశించాల్సింది. బహుశా అలాంటి ఆదేశం ఇస్తే దీర్ఘకాలం ఎదురుచూపులు చూడటం తప్ప ఫలితం ఉండబోదని న్యాయమూర్తులు భావించి ఉంటారు. న్యాయ స్థానాలు అడిగినప్పుడు ప్రభుత్వాలు తగిన సమాచారం ఇవ్వకపోవటం, వాయిదాలు కోరటం పర్యవసానంగా దేశంలో చాలా కేసులు పెండింగ్‌లో పడుతున్నాయి.వాస్తవానికి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రహదారుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఉన్న ఫుట్‌పాత్‌ల సంఖ్యను క్రోడీకరించినట్టు లేదు. ఫుట్‌పాత్‌ల నిర్మాణం, నిర్వహణ సాధారణంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నిర్వహణలో ఉంటాయి. కేంద్రం తల్చుకుంటే ఈ వివరాలు సేకరించి జాతీయ స్థాయి డేటా రూపొందించగలదు. కానీ ఆ అవసరం ఉందని భావించాలి గదా! ఫుట్‌పాత్‌లు అనేవి మన దేశంలో బ్రహ్మపదార్థం లాంటివి. రోడ్డుపక్కన ఎక్కడో ఒకచోట ఇటుక, సిమెంట్, టైల్స్ శిథిలాలుంటే ఒకప్పుడు ఇక్కడ ఫుట్‌పాత్ ఉండేదని అను కోవటం తప్ప చాలాచోట్ల వాటి జాడ కనబడదు. నగరాలూ, పట్టణాల్లో రోడ్డెక్కిన పాదచారి క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లటం కోసం దారిలో గోతులు, రాళ్లురప్పలూ ఉన్నాయేమో జాగ్రత్తగా చూసుకుంటూ నడవక తప్పని స్థితి. వీటి సంగతలావుంచి ట్రాఫిక్ రద్దీ సమయాల్లో ద్విచక్రవాహనదారులు అసహనంతో ఆ నడకదారులను సైతం కాజేస్తారు.ఇక చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునేవారు సరేసరి. హైదరాబాద్‌లో మెట్రో రైల్ వచ్చాక స్టేషన్లకు అటూ ఇటూ ఫుట్‌పాత్‌లపై రెస్టారెంట్లు వెలిసి పాదచారుల్ని సవాలు చేస్తున్నాయి. తోపుడు బండి లేదా సైకిళ్లపై వ్యాపారాలు చేసుకునేవారిని అప్పుడప్పుడు ట్రాఫిక్ పోలీసులు అదిలించటం కనబడుతుంది. కానీ మెట్రో స్టేషన్ల దగ్గరుండే రెస్టారెంట్ల జోలికి ఎవరూ వెళ్లిన దాఖలా లేదు. ఇక దేశంలోని ఆరు లక్షల గ్రామాల్లో ఫుట్‌పాత్‌ల సదుపాయంగల ఊళ్లు కనీసం వందల సంఖ్యలోనైనా ఉంటాయా అన్నది సందేహమే. వాటి సంగతలావుంచి దేశ రాజధాని నగరంలో 44 శాతం రోడ్లకు ఫుట్‌పాత్‌లు లేవని ఆమధ్య ఢిల్లీ ఐఐటీ నివేదిక తెలిపింది. ఉన్నచోటైనా దాదాపు 28 శాతం మాత్రమే ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) నిబంధనలకు అనుగుణమైనవని ఆ నివేదిక తేల్చిచెప్పింది.ఈ తీర్పు వెలువరించటానికి దారితీసిన కేసు విషాదకరమైనది. అయిదేళ్ల బాలుడిని అతని తండ్రి పాఠశాల సమీపంలో దించి వెళ్తుండగా హఠాత్తుగా వచ్చిన ట్యాంకర్ ఆ బాలుడిపైకి దూసుకెళ్లి ప్రాణాలు తీసింది. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వాలు కదిలితే ఇలాంటి విషాదాలను నివారించవచ్చు. అయితే బాధాకరమైన విషయమేమంటే... ఈ హక్కు అమల్లోకి రావాలంటే పౌరులు నెరవేర్చాల్సిన విధులు చాలా ఉంటాయి. ఫలానాచోట ఫుట్‌పాత్ లేదని సంబంధిత అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేసి, ఈ తీర్పును ఉటంకించాలి. అటు తర్వాత దాని సంగతేమైందో కనుక్కోవాలి. అవసరమైతే ఆర్టీఐని ఆశ్రయించాలి. అటు తర్వాత ఫుట్‌పాత్ లేనిచోట పరిస్థితిని తెలిపే ఫొటోతో హైకోర్టులో పిల్ దాఖలు చేయాలి. అందులో తీర్పు వెలువడటానికి దీర్ఘకాలం వేచిచూడాలి. విద్యాహక్కు చట్టం, పనిచేసే హక్కు చట్టంవంటివి ఆచరణలో ఎలా నీరుగారుతున్నాయో కనబడుతూనే ఉంది. ఏ హక్కు అమలు కావాలన్నా పౌరులంతా ఒక్కటై ఉద్యమించటమే, ప్రభుత్వాలపై ఒత్తిళ్లు తీసుకురావటమే మార్గం.

## విశాఖ పరిశ్రమలపై పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి -** ఫ్యాక్టరీలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో ఇద్దరు కార్మికులు లోపలే చిక్కుకుని సజీవదహనమయ్యారు. మరో ఇద్దరు గాయపడగా, వారిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటన గురించి తెలియగానే పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

**మొదటిపేజీ తరువాయి -** దశాబ్దాలుగా వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో, హాస్యంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్.. కళారంగానికి చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు.నటుడిగా, నిర్మాతగా 'జయభేరి' బ్యానర్‌పై అద్భుతమైన చిత్రాలు నిర్మించడమే కాకుండా, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మురళీమోహన్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రోపై కేంద్రమంత్రులతో చర్చలు ఫలప్రదం

**మొదటిపేజీ తరువాయి -** భవిష్యత్ కార్యాచరణ చేపట్టనుంది. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు దఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం సాయంత్రం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. ఇవాళ కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, అశ్వనీ వైష్ణవ్‌లతో కలిసి ఖట్టర్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి, దాదాపు అరగంట పాటు పలు అంశాలపై చర్చించారు.హైదరాబాద్ నగరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, మెట్రో రెండో దశ గురించి చర్చించినట్లు తెలుస్తోంది. సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డిలు కలిసిన సమయంలో సానుకూల స్పందన వచ్చింది. అంతేకాదు స్వయంగా రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇవాళ కలుస్తారని కూడా తెలియజేశారు.ఇవాల్టి ఖట్టర్ సమావేశంలో రైల్వే మంత్రి కూడా పాల్గొనడం శుభపరిణామంగా చెప్పొచ్చు. దిల్లీలో చోటు చేసుకున్న ఈ పరిణామాలను చూస్తుంటే రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి వివిధ శాఖల కేంద్రమంత్రులను కలవడంతో సానుకూల స్పందన వస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం ముంబయి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, అక్కడి నుంచి ఆదివారం దిల్లీ వెళ్లారు. నిన్న, ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి దిల్లీలో మకాం వేసి కేంద్రమంత్రులతో వరుసగా సమావేశమవుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరుతున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన సీఎం ప్రధానంగా మెట్రో విస్తరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) నుంచి రుణ సదుపాయం, హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థ విస్తరణ, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయమని కోరుతూ తనకు రెండుసార్లు లేఖ రాశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు. గత రెండు రోజులుగా తాను దిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశానన్నారు. సోమవారం అశ్వినీ వైష్ణవ్‌తో జరిగిన సమావేశం, కేంద్ర మంత్రి ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌లతో జరిగిన సంయుక్త సమావేశం అనుకూల వాతావరణంలో జరిగాయని తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా, తాను ఎల్లప్పుడూ తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణ పథకానికి పేరు సూచిస్తే లక్ష రివార్డ్

**మొదటిపేజీ తరువాయి -** ప్రాంతంలో లక్ష ఇళ్లను నిర్మించాలన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ భారీ ప్రాజెక్టుకు సముచితమైన పేరును నిర్ణయించే ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని భావిస్తున్నట్లు హౌసింగ్ బోర్డ్ వైస్-ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ సూచనలను **tghd.official** అనే అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా సమర్పించవచ్చు. పేర్లను పంపేందుకు 2026 జూన్ 28వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62కు పెంపు



**మొదటిపేజీ తరువాయి -** మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపు, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది.కేబినెట్ ఆమోదం తెలిపిన అజెండాలో ఉన్న పలు కీలక ప్రాజెక్టులను పరిశీలిస్తే పరిశ్రమలు, తయారీ రంగంలో సుమారు రూ.22,000ల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ఐటీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ రూ.5300 కోట్లకు పైగా పెట్టుబడులను ఆమోదించింది. ఫుడ్ ప్రాసెసింగ్, పతంజలి, న్యూట్రిఫీడ్స్ రూ.586 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా రక్షణ, ఏరోస్పేస్ ప్రాజెక్టుల ద్వారా వందల కోట్ల పెట్టుబడులు లభించాయి.అదేవిధంగా బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. 10 ఎంజేపీ గురుకులాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని ఎచ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచర్ల (పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి(అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం (కర్నూలు), పెనుకొండ, కదిరి(శ్రీసత్యసాయి)లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐదు బాలికలవి కాగా మరో ఐదు బాలురవి. అదేవిధంగా ఒక్కో గురుకులంలో 37 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇవి ప్రారంభం కానున్నాయి.అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ఒకటి, రెండో దశల కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం లభించింది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిని 15 కిలోమీటర్లకు హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వెటరన్, ఫ్యామిలీ సీపీఎస్ కంట్రిబ్యూషన్‌పై కేబినెట్ స్పష్టత ఇచ్చింది. ఉద్యోగుల గ్రాట్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను సర్కార్ పరిష్కరించింది. దీంతో రాష్ట్రంలోని 11,000ల మంది సీపీఎస్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. జీఓఎమ్ నంబర్ 57 అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సచివాలయ సీపీఎస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపింది.కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం, ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుందని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ తెలిపారు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మెమో 57 ప్రకారం 11,000ల మంది ఉద్యోగులకు మేలు జరగనుందని చెప్పారు. అదేవిధంగా ఉద్యోగులు పదవీ విరమణ వయసును 60 నుంచి 62 పెంచడం వల్ల తమ కల ఫలించిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల తరఫున సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు. మరోవైపు కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులైజేషన్ సంబంధించి 8000ల మందికి ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 పెంచాలని కోరుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని, విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు.

## అమరావతికి మేము వ్యతిరేకం కాదు



**మొదటిపేజీ తరువాయి -** ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతల విమర్శలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. తాజాగా వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ... అమరావతి డెవలప్‌మెంట్, విద్యా-వైద్య రంగాల్లో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై విమర్శలు గుప్పించారు. అమరావతి అభివృద్ధికి తమ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అక్కడ సాగుతున్న అవినీతిని మాత్రమే తాము ప్రశ్నిస్తున్నామని అన్నారు. మదనపల్లెలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత జగన్ ప్రభుత్వ హయాంలో మదనపల్లెకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కావాలనే అడ్డుకుందని మిథున్ రెడ్డి ఆరోపించారు. మెడికల్ కాలేజీలు పూర్తయితే పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని, కానీ దీనిపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక చంద్రబాబు ప్రభుత్వం జగన్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. మదనపల్లెను జిల్లాగా ప్రకటించడం తప్ప కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడ ఒక్క అడుగు కూడా అభివృద్ధి జరగలేదన్నారు.డీఎస్సీ పరీక్షలపై ఆయన స్పందిస్తూ... "మెరిట్ లిస్ట్‌లో మొదటి ర్యాంక్ సాధించిన అభ్యర్థిని అన్యాయంగా పక్కన పెట్టడంతోనే ఈ పరీక్షల లీకేజీ వ్యవహారం మొత్తం బయటపడింది. కష్టపడి చదివిన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి, అడ్డదారుల్లో పోస్టులు అమ్ముకోవడం అత్యంత అప్రజాస్వామికం. దీనిపై తక్షణమే పూర్తి స్థాయి స్వతంత్ర విచారణ జరపాలి" అని డిమాండ్ చేశారు.మదనపల్లె టౌన్ బ్యాంక్‌లో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని, దీనికి సంబంధించిన ఇన్‌సైడ్ సమాచారాన్ని స్వయంగా తెలుగుదేశం పార్టీ నేతలే తనకు అందించారని తెలిపారు. ఈ బ్యాంక్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. అలాగే కూటమి పాలనలో రాష్ట్రంలోని మామిడి రైతులు దారుణంగా నష్టపోయారని, వారిని ఆదుకోవడంలో సర్కార్ ఫెయిల్ అయిందని విమర్శించారు.

## సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు


**మొదటిపేజీ తరువాయి - ౧**

వ్యాఖ్యలను కూడా భారత్ తోసిపుచ్చింది. పాక్ అనుసరిస్తున్న విధానాలే పీఓకేలో ఆందోళనలకు కారణమని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.దశాబ్దాలుగా అక్కడి ప్రజలను ఆర్థికంగా పాకిస్థాన్ దోపిడీ చేయడంతో పాటు, పరిపాలనాపరమైన అణచివేతకు పాల్పడటం వల్లే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని జైస్వాల్ పేర్కొన్నారు. నిరసనలను అణచివేసేందుకు నిరాయుధులైన పౌరులపై ఆయుధాలను ప్రయోగించడం, తీవ్రమైన పోలీసు దౌర్జన్యాలకు పాల్పడటం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాక్ రక్షణ మంత్రి ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని, అంతర్గత వైఫల్యాల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నమేనని రణధీర్ జైస్వాల్ కొట్టిపారేశారు.మరోవైపు, పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడి ప్రజలపై అమానుష చర్యలకు పాల్పడుతోందని విదేశాంగ శాఖ ఆరోపించింది. నిత్యావసర వస్తువులు, ఔషధాల సరఫరాను అడ్డుకోవడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, నిరాయుధ పౌరులపై ప్రాణాంతక బలప్రయోగం చేయడం వంటి చర్యలను తీవ్రంగా విమర్శించింది. అయితే, ఈ చర్యల కారణంగా ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారని జైస్వాల్ ఆరోపించారు.గత శనివారం పాకిస్థాన్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడిందని భావిస్తే, భారత్‌తో యుద్ధానికి వెనుకాడబోమని వ్యాఖ్యానించారు. భారత్ తమ నీటి వనరులను అడ్డుకునే చర్యలను వేగవంతం చేస్తోందని నిర్ధారణ అయితే సైనిక చర్యలను కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. చెనాబ్ నదిపై నీటి ప్రవాహాన్ని భారత్ నియంత్రిస్తోందని, అలాగే, నదీ ప్రవాహాలకు సంబంధించి ఎలాంటి సమాచారం పంచుకోవడం లేదని ఆరోపించారు.ఇదిలా ఉండగా, పశ్చిమాసియా పరిస్థితుల గురించి కూడా రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. "ఆంక్షలు, ఇతర ఇటీవలి పరిణామాల విషయానికి వస్తే, మేం పశ్చిమ ఆసియాకు సంబంధించిన అన్ని పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఇంధన వనరుల విషయానికొస్తే, మా విధానం జాతీయ ప్రయోజనాలకే నిర్దేశించింది. 140 కోట్ల మంది ప్రజలకు సరసమైన ధరలకు ఇంధనం అందుబాటులో ఉండేలా చూడటమే మా బాధ్యత. ఇటీవల, అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత హార్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. ఇటీవలి కాలంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)తో కూడా సంబంధాలు బలపడ్డాయి. ఇందులో రక్షణ భాగస్వామ్యం కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవలి కాలంలో రక్షణ భాగస్వామ్యం మరింత బలోపేతం అయ్యింది" అని రణధీర్ పేర్కొన్నారు.ఇక, ఖతార్‌లోని రస్ లఫాన్ పారిశ్రామిక నగరంలోని గ్యాస్‌క్షేత్రంలో జరిగిన పేలుడు ఘటనలో 12 మంది భారతీయులు మృతి చెందడంపై రణధీర్ జైస్వాల్ సంతాపం వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు మిగతా దేశాలకు చెందినవారు కూడా చనిపోవడం విచారకరమన్నారు. అయితే, చనిపోయిన భారతీయులను గుర్తించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, అలాగే, వారి మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడానికి స్థానిక అధికారులతో చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలతోనూ సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అయితే, గాయపడ్డవారిలో ఎంతమంది భారతీయులు ఉన్నారనేది ఇంకా స్పష్టంగా తెలియదని ఆయన చెప్పారు.

## ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షల సడలింపు.. భారత్‌కు భారీ ఊరట!

**మొదటిపేజీ తరువాయి -** అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ చమురు పరిశ్రమకు ఊహించని ఊరటనిస్తూ అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇరాన్‌పై విధించిన కఠినమైన ఆంక్షలను తాత్కాలికంగా సడలిస్తూ 60 రోజుల మినహాయింపు ప్రకటించింది. ఆగస్టు 21 వరకు అమల్లో ఉండే ఈ నిర్ణయం ప్రకారం ఇరాన్ నుంచి ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తి, అమ్మకం, రవాణా, దిగుమతులకు అనుమతి లభించింది. టెహరాన్‌తో విస్తృత శాంతి ఒప్పందం, అంతర్జాతీయ అణు తనిఖీలను తిరిగి ప్రారంభించే లక్ష్యంతో జరుగుతున్న చర్చల్లో భాగంగా అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. ఇది ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పెంచే చర్యగా భావిస్తున్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు దిగుమతిదారుల్లో ఒకటైన భారత్‌కు ఈ పరిణామం వ్యూహాత్మకంగా ఎంతో మేలు చేయనుంది. తన మొత్తం చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడే భారత్, అంతర్జాతీయ ధరల ఒడిదొడుకులకు తీవ్రంగా ప్రభావితమవుతుంది. ముడి చమురు ధరల్లో ఏ చిన్న పెరుగుదలైనా దేశ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలపై పెను ప్రభావాన్ని చూపుతుంది.గత నాలుగేళ్లలో భారత్ చమురు దిగుమతుల సరళిలో భారీ మార్పులు వచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారత్ రాయితీపై లభించే రష్యన్ ముడి చమురుకు అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. ప్రస్తుతం మన దేశ మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 30-40 శాతంగా ఉంది. అదే సమయంలో సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలపై కూడా భారత్ అధికంగా ఆధారపడి ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ, ఈ ఏకపక్ష ధోరణి వల్ల సరఫరాకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఇరాన్ తిరిగి మార్కెట్లోకి వస్తే, భారత్‌కు మరో కీలకమైన, నమ్మకమైన చమురు వనరు అందుబాటులోకి వస్తుంది.2018లో అమెరికా ఆంక్షలను తిరిగి విధించక ముందు, ఇరాన్ భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారులలో ఒకటిగా ఉండేది. పోటీ ధర, అనుకూలమైన రుణ నిబంధనలు, తక్కువ రవాణా ఖర్చులు వంటి కారణాలతో భారత రిఫైనరీలు ఇరాన్ చమురుకు ప్రాధాన్యత ఇచ్చేవి. కానీ ఆంక్షల వల్ల ఇరాన్ నుంచి దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు లభించిన ఈ తాత్కాలిక అవకాశంతో భారత రిఫైనరీలు, ఇరాన్ సరఫరాదారుల మధ్య మళ్లీ చర్చలు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.ప్రస్తుత మినహాయింపు కేవలం 60 రోజులు మాత్రమే కావడంతో, భారత రిఫైనరీలు తక్షణమే భారీ కొనుగోళ్లకు సిద్ధపడకపోవచ్చు. దీర్ఘకాలిక స్పష్టత లభిస్తేనే వారు ఒప్పందాలు చేసుకుంటారు. అయితే, చర్చలు సఫలమైతే ఇరాన్ చమురు క్రమంగా మార్కెట్లోకి వస్తుందనే సంకేతాలు వెలువడ్డాయి. దీనివల్ల ప్రపంచ మార్కెట్లో చమురు సరఫరా పెరిగి ధరలు నియంత్రణలోకి వస్తాయి. భారత్ నేరుగా ఇరాన్ నుంచి కొనుగోలు చేయకపోయినా, ప్రపంచవ్యాప్తంగా ధరలు తగ్గితే అది మన దేశానికి పరోక్షంగా లాభమే.మరోవైపు హార్మూజ్ జలసంధి అంశం కూడా భారత్‌కు చాలా ముఖ్యం. మన దేశానికి వచ్చే చమురులో అత్యధిక భాగం ఈ జలసంధి ద్వారానే ప్రయాణిస్తుంది. అమెరికా-ఇరాన్ ఒప్పందంలో ఈ మార్గంలో నౌకల స్వేచ్ఛా రవాణాకు భరోసా లభించడం భారత్‌కు ఎంతో సానుకూల అంశం. ఇది కార్యరూపం దాల్చితే ఇరాన్ నుంచి చమురు దిగుమతులు పెరిగి, మన ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడమే కాకుండా, ఇంధన ధరలు దిగివచ్చే అవకాశాలు కూడా మెరుగుపడతాయి.

## జులై 5 నుంచి నిరవధిక నిరాహార దీక్ష



**మొదటిపేజీ తరువాయి -** మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన సమాచార హక్కు (ఆర్టీఐ) నిబంధనల సవరణలను వెంటనే రద్దు చేయాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే డిమాండ్ చేశారు. లేదంటే జులై 5 నుంచి అహ్మద్‌నగర్ జిల్లా రాలేగాన్ సిద్ధిలోని యాదవ్‌బాబా ఆలయం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.ఈ మేరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసిన హజారే.. జూన్ 12న తీసుకొచ్చిన మహారాష్ట్ర ఆర్టీఐ రూల్స్--2026, సమాచార హక్కు చట్టం స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కొత్త నిబంధనల వల్ల ఆర్టీఐ చట్టం లక్ష్యం నీరుగారి, ప్రజలకు సమాచారం అందడం మరింత కష్టమవుతుందని విమర్శించారు.ఆర్టీఐ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్నీ హజారే తీవ్రంగా వ్యతిరేకించారు. 20 ఏళ్ల తర్వాత ఫీజులు పెంచితే, సమాచారం ఇవ్వకుండా ఆలస్యం చేసే అధికారులపై విధించే జరిమానాలను కూడా పెంచాలని సూచించారు. దరఖాస్తుదారులు గుర్తింపు పత్రాలు సమర్పించాల్సిన నిబంధన కూడా చట్టానికి విరుద్ధమని అన్నారు. ఇది సమాచారాన్ని కోరేవారి భద్రతకు ముప్పుగా మారుతుందని చెప్పారు.'ఒక దరఖాస్తులో ఒకే అంశం' అనే నిబంధన అనవసర భారమని, ఒకే అంశంపై మళ్లీ దరఖాస్తు చేస్తే దాన్ని తిరస్కరించే అవకాశం కల్పించడం వల్ల పూర్తి సమాచారం పొందే హక్కు దెబ్బతింటుందని హజారే అభిప్రాయపడ్డారు. ప్రజలకు స్వయంగా సమాచారం అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యాలను సరిచేయకుండా, భారం మొత్తం ప్రజలపైనే మోపుతున్నారని విమర్శించారు.ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఈ సవరణలను అమలు చేశారని ఆరోపించిన హజారే.. ప్రభుత్వం వెంటనే వాటిని ఉపసంహరించుకోకపోతే ప్రాణాలు పోయినా జులై 5 నుంచి దీక్ష ప్రారంభిస్తానని స్పష్టం చేశారు.

## ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం



**మొదటిపేజీ తరువాయి -** సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు.మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు.ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# మూతపడ్డ స్కూల్స్ మళ్లీ తెరుచుకుంటున్నాయి

**జగిత్యాల జిల్లాలో 13 బడులు రీఓపెన్**

**ఏళ్లుగా మూతబడి, ఈ ఏడాది తెరుచుకుంటున్న సర్కారు బళ్లు**

**సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లితండ్రుల చొరవతో మళ్లీ రీఓపెన్**

**పలు ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలల బస్సులను అడ్డుకుంటున్న పేరెంట్స్**



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏళ్లుగా మూతబడ్డ సర్కారు బళ్లు తిరిగి తెరచుకుంటున్నాయి. ఒక్క జగిత్యాల జిల్లాలోనే 13 స్కూళ్లు ఈ విద్యా సంవత్సరం తెరచుకున్నాయి. గ్రామ పంచాయతీ పాలక వర్గం, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, తల్లితండ్రులు ప్రత్యేక చొరవ తీసుకుని పిల్లల్ని సర్కారు బళ్లకు పంపుతున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ బళ్లల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రైవేటు పాఠశాలల బస్సులను రాకుండా అడ్డుకుంటున్నారు. సర్కారీ బడిలో విద్య సహా ఇతర సదుపాయాలపై పేరెంట్స్‌కు అవగాహన కల్పిస్తున్నారు.ఇది జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రంగారావుపేట తండా. ఈ తండాలో పదేళ్ల కిందట సర్కారు బడి నడిపారు. వివిధ కారణాలతో అప్పట్లో నడిపిన బడిని మూసివేశారు. అప్పటి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిట్టంపేటలోని సర్కారు బడికి తమ పిల్లల్ని పంపేవారు. బస్సులో వెళ్లి, బస్సులో వచ్చేవారు. కొంతమంది తల్లితండ్రులు తమ పిల్లల్ని తమవెంట కూలీ పనుల కోసం తీసుకెళ్లేవారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు ఆ తండాలో సర్కారు బడి తెరుచుకుంది.చదువుకునే పిల్లల సంఖ్య అధికంగా ఉందని, తమ ఊళ్లో పాఠశాల తెరవాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మంజుల, ఉపసర్పంచ్ భూక్యామదన్ లాల్ పలుమార్లు విద్యాశాఖ అధికారులకు విన్నవించారు. వారి విన్నపాలను ఆలకించిన విద్యాశాఖ ఎట్టకేలకు ఈ విద్యా సంవత్సరం నుంచి అక్కడ బడి తెరచింది. పాఠశాల భవనం లేకపోవడంతో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే బడిని ప్రారంభించారు. సర్పంచ్ మంజుల తమ ఇద్దరు పిల్లల్ని ఇదే పాఠశాలలో చేర్చి ఆదర్శంగా నిలిచారు. ఊళ్లోనే బడి తెరచుకోవడంతో సుమారు 25 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చేరారు. పాఠశాల ప్రారంభం అక్కడ వేడుకలా జరిగింది.పదేళ్ల తర్వాత బడి తెరుచుకుంది. ఇప్పటి వరకు పిల్లలు ప్రైవేటు స్కూల్‌కి వెళ్లేవారు. మా తండాలోనూ స్కూల్ ఉండాలని అనుకున్నాం. ఎంఈవో మేడం స్పందించారు. మా పిల్లల్ని కూడా ఈ పాఠశాలలోనే చేర్పించాం. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం గోవింద్‌పల్లిలో విద్యార్థులు లేకపోవడంతో అక్కడి ప్రాథమిక పాఠశాల మూతపడింది. అక్కడి పిల్లలంతా దగ్గర్లోని నేరెళ్ల, ధర్మపురిల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే వాళ్లు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం, నాయకులు, గ్రామస్థులంతా తిరిగి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాలని కంకణం కట్టుకున్నారు. విద్యాశాఖ అధికారులను ఒప్పించి తిరిగి బడిని తెరిపించారు. ఐదో తరగతి వరకూ సుమారు 26 మంది పిల్లలు చేరారు. ప్రైవేటు పాఠశాలల వాహనాలను సైతం గ్రామస్థులు ఊళ్లోకి రానివ్వడం లేదు. మొదటి రోజు నుంచే మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. పాఠశాల భవనం ఉన్నా మూత్రశాలలు, వంటగది లేవు. వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌కు సైతం వినతి పత్రం అందించారు.జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం బొల్లొని చెరువులో ఐదేళ్ల కిందట అక్కడి సర్కారు బడి మూతబడింది. చదువుకునే విద్యార్థులంతా కొడిమ్యాలలోని ప్రైవేటు స్కూళ్లో చదివే వాళ్లు. ఎలాగైనా స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలను తెరవాలని ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు చొరవ తీసుకున్నారు. ఈ విద్యాసంవత్సరం ఐదో తరగతి వరకూ బడి తెరిచారు. 18 మంది విద్యార్థులు చేరారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో రెండేళ్లుగా అక్కడి ప్రభుత్వ పాఠశాల మూతబడింది. ఈ విద్యాసంవత్సరం గ్రామస్థుల చొరవతో తిరిగి ప్రారంభమైంది. సోమవారం ఊళ్లోకి వచ్చిన రెండు ప్రైవేటు స్కూళ్ల బస్సుల్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. వారిని సర్కారు బడికి తీసుకువెళ్లారు. వారి తల్లిదండ్రులకు సైతం సర్కారు బళ్లలో విద్య, వసతులపై అవగాహన కల్పించారు.జగిత్యాల జిల్లాలో చాలా కాలంగా మూతపడి ఈ విద్యా సంవత్సరం నుంచి 13 పాఠశాలలు తెరచుకున్నాయి. ఇప్పటి వరకూ ఉన్న సమాచారం మేరకు కరీంనగర్ జిల్లాలో 2, సిరిసిల్లలో 2, పెద్దపల్లిలో ఒక పాఠశాల ఈ విద్యాసంవత్సరం నుంచి తెరచుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1653 పాఠశాలలుంటే అందులో 163 బళ్లు వివిధ కారణాలతో కొన్నేళ్లుగా మూతబడుతూ వచ్చాయి. వాటిని తిరిగి తెరిపించేందుకు గ్రామస్థులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, ఉపాధ్యాయులు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

# 24 గంటల్లో రాష్ట్రమంతటా నైరుతి విస్తరణ

**5 రోజుల పాటు భారీ వర్షాలు**

**24 గంటల్లో రాష్ట్రమంతటా విస్తరించనున్న నైరుతి రుతుపవనాలు**

**మూడు రోజుల పాటు భారీ వర్షాలు - వాతావరణ శాఖ వెల్లడి**



నైరుతి రుతుపవనాలు సోమవారం రాష్ట్రంలోకి మరింతగా విస్తరించాయి. రాబోయే 24 గంటల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తెలంగాణ నుంచి రాయలసీమ మీదుగా మన్నర్ వరకు ద్రోణి విస్తరించి ఉంది. ఈ కారణంగా మంగళ, బుధ, గురువారాల్లో రాష్ట్రంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది.తెలంగాణలోని పలు జిల్లాల్లో ఐదు రోజుల పాటు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. బుధవారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నాయి. గురువారం ఈ జిల్లాలతో పాటు పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నైరుతి రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది.జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో సోమవారం 7.9 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది.జగిత్యాల జిల్లా మేడిపల్లిలో 5.1, మంచిర్యాల జిల్లా తాండూర్‌లో 3.8 సెం.మీ వర్షపాతం నమోదైంది.రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.మరోవైపు ఆదిలాబాద్, పెద్దపల్లి జిల్లాల్లోని పలు మండలాల్లో వడగాలులు నమోదయ్యాయి.హైదరాబాద్‌లోనూ దంచికొట్టిన వాన : హైదరాబాద్‌లో పలుచోట్ల సోమవారం వాన దంచికొట్టింది. నిన్న ఉ.8.30 నుంచి ఇవాళ ఉ.6 వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. చందానగర్‌లో 12.8, రామచంద్రాపురంలో 12.1 సెం.మీ, లింగంపల్లిలో 11.9, మియాపూర్‌లో 11.4 సెం.మీ, మైలార్‌దేవ్‌పల్లిలో 11.1, గచ్చిబౌలి 10.3 సెం.మీ, హఫీజ్‌పేటలో 8.5, అమీన్‌పూర్‌లో 7.7 సెం.మీ, పటాన్‌చెరులో 7.6, మాదాపూర్‌లో 6.4 సెం.మీ, షేక్‌పేటలో 6.1, బాచుపల్లిలో 5.7, మణికొండలో 5.4 సెం.మీ, కూకట్‌పల్లిలో 5, ఇబ్రహీంపట్నంలో 4.8 సెం.మీ వర్షపాతం నమోదైంది.మరోవైపు ఏపీలో రాగల మూడు గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో ఈదురు గాలులతో వర్షం, పిడుగులు పడే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావం, రుతుపవనాల కదలికల్లో వేగం తగ్గడంతో తెలంగాణలోని వాతావరణంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తుండగా మరికొన్ని జిల్లాలో వడగాల్పుల తీవ్రత ఎండాకాలం మాదిరేగానే ఉంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులుపాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతుండటం ఆందోళన కలిగిస్తుంది. వర్షాలు కురిసే ముందు గాలులు తీవ్రంగా వీయడంతో కరెంటు స్తంభాలు, చెట్లు కూలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. వర్షాలు కురిసినప్పుడు విపత్తు నిర్వహణ, విద్యుత్, పోలీసు వంటి ఇతర శాఖలు వేగంగా సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# భయంతో వచ్చిన రోగి, చిరునవ్వుతో ఇంటికి వెళ్లడమే మా లక్ష్యం

**ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ**

**ఘనంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం**

**డబ్బులేక ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం**

**కాకూడదన్న బాలకృష్ణ**

**భవిష్యత్తులో మరింత మందికి సేవలు అందించేందుకు**

**కృషి చేస్తామన్న బాలకృష్ణ**



పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 45 శస్త్రచికిత్సలు చేస్తున్నామని వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సిల్వర్ జ్యూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తాను నటుడిగానో, ఎమ్మెల్యేగానో తాను రాలేదని ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నానని అన్నారు. 1984వ సంవత్సరంలో తమ తల్లి బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు తాము ఎంతో బాధపడ్డామని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో ఆమె కేవలం తన ఆరోగ్యం కోలుకోవడం గురించే కాదు, చికిత్సకయ్యే ఖర్చుల గురించీ మా అమ్మ ఆందోళన చెందారని బాలకృష్ణ చెప్పారు.తమకు డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగామని, అయితే డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని తమ తల్లి ప్రశ్నించారని ఆయన పేర్కొన్నారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చిందన్నారు. తమ తల్లి వేసిన ఆ ప్రశ్నే తమ కుటుంబ బాధ్యతను గుర్తు చేసిందని, దాంతో తమ తండ్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) ఆ ప్రశ్నను ఒక గొప్ప లక్ష్యంగా తీసుకున్నారని బాలకృష్ణ తెలిపారు.కేవలం సరైన చికిత్స అందుబాటులో లేదనే కారణంతో ఒక్క ప్రాణం కూడా పోకూడదనే పట్టుదలతో మా నాన్న1989లోనే ఈ సంస్థకు పునాది వేశారని బాలకృష్ణ వెల్లడించారు. ఇప్పటివరకు దాదాపు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించామన్నారు. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే తమ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. భారత్‌లోనే మొట్ట మొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాన్ని అప్పట్లోనే ప్రారంభించామని ఈ సందర్భంగా బాలకృష్ణ గుర్తు చేశారు.ఈ సుదీర్ఘ ప్రయాణంలో ప్రభుత్వాలు ఎంతగానో సహకరించాయన్నారు. ఎన్నో సంస్థలు, దాతలు మాకు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క రోగి కూడా క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదన్నదే తమ ధ్యేయమని చెప్పారు. 25 ఏళ్ల క్రితం తాము చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నామని, భవిష్యత్తులోనూ దీనిని ఇలాగే కొనసాగిస్తామని బాలకృష్ణ భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగానే రాబోయే రోజుల్లో అమరావతిలో నూతనంగా క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మిస్తామని, అదేవిధంగా హైదరాబాద్‌లోని సేవలను మరింత విస్తరిస్తామని బాలకృష్ణ అన్నారు.

# సినిమాల నుంచి నేరుగా సీఎం కాలేదు



తమిళనాడు అసెంబ్లీ సమావేశాల చివరి రోజున ముఖ్యమంత్రి విజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తాను షూటింగ్ నుంచి నేరుగా వచ్చి సీఎం అయినట్లుగా కొందరు ఇమేజ్ క్రియేట్ చేస్తున్నారన్నారు. కానీ, అందులో నిజం లేదని వ్యాఖ్యానించారు.అసెంబ్లీలో సభ్యుల చర్చలకు సమాధానం ఇస్తూ విజయ్ మాట్లాడారు. తమిళ వెట్రి కళగం (టీవీకే)కు మద్దతు ఇచ్చి అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవ కోసం అందరూ కలిసి పనిచేస్తే తమిళనాడు దేశంలో అగ్రస్థానంలో నిలుస్తుందని వ్యాఖ్యానించారు."షూటింగ్ నుంచి నేరుగా అసెంబ్లీకి వచ్చి సీఎం అయినట్లుగా కొందరు ప్రచారం చేస్తున్నారు. అది నిజం కాదు. ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో చోటు సంపాదించుకున్నందుకే నేను సీఎం అయ్యాను" అని విజయ్ వ్యాఖ్యానించారు. 1990ల నుంచే అభిమాన సంఘాల ద్వారా ప్రజలకు అండగా నిలిచామని విజయ్ తెలిపారు. రాజకీయాలపై మాట్లాడినందుకే తన సినిమాలు అనేక సమస్యలను ఎదుర్కొన్నాయని, ఆ విషయాలు అందరికీ తెలుసని అన్నారు.అలాగే ప్రభుత్వంపై విమర్శలు చేసిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌తో పాటు ఇతర సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిపక్షం తన బాధ్యతలో భాగంగా ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యానికి అవసరమని పేర్కొన్నారు. కరూర్ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర వేదన కలిగించిందని అన్నారు. ఆ బాధను మాటల్లో చెప్పలేనని, ఆ విషాదాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని చెప్పారు.తమిళ వెట్రి కళగం ఆవిర్భవించిన వెంటనే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను వ్యతిరేకిస్తూ ప్రకటన విడుదల చేశామని గుర్తుచేశారు. తన సినిమాల్లో కూడా అవినీతి వ్యతిరేకత, సామాజిక న్యాయం, విద్య వంటి అంశాలనే ప్రస్తావించానని చెప్పారు.

# పరామర్శకు వెళ్తూ ప్రాణాలు కోల్పోయారు

**ఆటోను ఢీకొన్న లారీ- ముగ్గురు మృతి**

**ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలంలో రోడ్డు ప్రమాదం**

**బంధువుల ఇంటికి వెళ్తూ ప్రాణాలు కోల్పోయిన బాధితులు**



దుఃఖంలో ఉన్నవారిని ఓదార్చడానికి వెళ్తున్నవారిపై విధి పంజా విసిరింది. వేగంగా వచ్చిన ఒక లారీ వారిని ఢీకొట్టింది. ప్రకాశం జిల్లా, సంతమాగులూరు మండలం వెల్లాలచెరువు వద్ద జరిగిన ఈ విషాదకరమైన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.సంతమాగులూరు సబ్-ఇన్‌స్పెక్టర్ ఎం. పట్టాభిరామయ్య తెలిపిన వివరాల ప్రకారం, పల్నాడు జిల్లా సావల్యాపురం మండలం వేల్పూరుకు చెందిన పదిమంది బంధువులు సోమవారం ఉదయం ఆటో-రిక్షాలో బయలుదేరారు. వారు అదే జిల్లాలోని నాదెండ్ల మండలం సంక్రాంతిపాడులో ఉన్న తమ బంధువు ఒకరి దశదిన కర్మ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వెళ్తున్నారు. వారి వాహనం ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం వెల్లాలచెరువు సమీపంలో వెళ్తుండగా, స్థానిక గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి జాతీయ రహదారిపైకి అకస్మాత్తుగా వేగంగా వచ్చిన ఒక లారీ వారి వాహనాన్ని ఢీకొట్టింది.కంటి రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు దావులూరి ఏడుకొండలు (60) ఎం. రమణమ్మ (55)అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన యలవర్తి సుబ్బాయమ్మ (56)ను నరసరావుపేటలోని ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. గుట్ట సుబ్బాయమ్మ, ఎం. వెంకటరామయ్య, ఎం. సుబ్బాయమ్మ, బోయపాటి లక్ష్మీదేవి, బి. అనురాధ ఆటో డ్రైవర్ మీరావలి తీవ్రంగా గాయపడ్డారు. వారిని పల్నాడు జిల్లా నరసరావుపేటలోని వివిధ ఆసుపత్రులలో చేర్పించారు. చిన్న యోగమ్మ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.మరణించిన వారిలో దావులూరి ఏడుకొండలు పాఠశాల విద్యా కమిటీ మాజీ ఛైర్మన్‌గా పనిచేశారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన ఎంతో కృషి చేశారు. ముండ్రు సుబ్బాయమ్మ ఆమె భర్త వెంకటసుబ్బయ్య వ్యవసాయం ద్వారా జీవనోపాధి పొందుతుండేవారు. బాధితులు ముగ్గురూ ఒకరికొకరు దగ్గరగా నివసిస్తుండటంతో, ఆ గ్రామం రోదనలు విషాదంతో నిండిపోయింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆ ముగ్గురి పట్ల చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అలాగే నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు."సంక్రాంతిపాడులో బంధువులు ఏర్పాటు చేసిన దశదిన కర్మకు హాజరయ్యేందుకు సుమారు పది మంది వేల్పూరు నుంచి ఆటో-రిక్షాలో బయలుదేరారు. వారు వెళు ుండగా స్థానిక గ్రానైట్ కర్మాగారం నుంచి వేగంగా వచ్చిన ఒక లారీ ఆ ఆటో-రిక్షాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా మరో ఆరుగురు గాయపడ్డారు".

# తుంగభద్ర ప్రాజెక్టు కొత్తగేట్లతో ముస్తాబు

**ఈనెల 25న ప్రారంభోత్సవం**

**కర్ణాటకాంధ్ర జీవనాడికి కొత్తరూపు**

**పూర్తయిన 33 నూతన క్రస్ట్ గేట్ల బిగింపు ప్రక్రియ**

**25న తుంగభద్ర నూతన గేట్ల ప్రారంభోత్సవం**

**హాజరుకానున్న కర్ణాటక, ఏపీ ముఖ్యమంత్రులు**



కర్ణాటకాంధ్ర జీవనాడి తుంగభద్ర ప్రాజెక్టు కొత్తగేట్లతో ముస్తాబైంది. మూడు రాష్ట్రాల ప్రజల సాగు, తాగు అవసరాలను తీర్చుతున్న జలాశయానికి 33 నూతన క్రస్ట్ గేట్లు బిగించే ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 25న తుంగభద్ర నూతన గేట్ల ప్రారంభోత్సవానికి కర్ణాటక, ఏపీ ముఖ్యమంత్రులు డీకే శివకుమార్, చంద్రబాబు తరలిరానున్నారు.కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ బహుళార్థక సాధక ప్రాజెక్టు తుంగభద్ర జలాశయానికి నూతన గేట్లు బిగించడంతో కొత్త రూపు సంతరించుకుంది. కర్ణాటకలోని బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు జిల్లాలు ఉమ్మడి ఏపీలో అనంతపురం, కర్నూలు, కడప, మహబూబ్‌నగర్ జిల్లాల వాసులకు తాగునీరు, సాగునీరు అందిస్తోంది. కర్ణాటకాంధ్ర జీవనాడిగా పేరొందిన ఈ ప్రాజెక్టు నిర్మించి 73 ఏళ్లు పూర్తయ్యాయి. ఏడాది కిందట జలాశయం 19వ గేటు కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందారు.అనంతరం దానికి నిపుణుల సహాయంతో స్టాప్‌లాగ్ గేట్ బిగించి నీటి వృథాను ఆపారు. తర్వాత కాలంలో నిపుణుల బృందం సూచన మేరకు 33 పాత క్రస్ట్ గేట్లను తొలగించి కొత్త వాటిని అమర్చారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తికావడంతో ఈ ప్రాంత కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25న కర్ణాటక, ఏపీ ముఖ్యమంత్రులు డీకే శివకుమార్, చంద్రబాబు చేతుల మీదుగా మునిరాబాద్ వద్ద గేట్లను లాంఛనంగా ప్రారంభించనున్నారు.విజయనగర జిల్లా హొసపేటె సమీపంలోని మల్లాపుర వద్ద తుంగభద్ర జలాశయానికి 1945 ఫిబ్రవరి 28న పునాది రాయి పడింది. ఈ జలాశయం నిర్మాణానికి మల్లాపుర చుట్టుపక్కల గ్రామాల్లోని 54 వేల 452 మందిని వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. మొత్తం 86 వేల 293 ఎకరాలను సేకరించారు. జలాశయం నిర్మాణంలో 12 వేల మంది, కాలువల నిర్మాణానికి 38 వేల మంది కలిపి మొత్తం 50 వేల మంది కార్మికులు శ్రమించారు. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా జలాశయ నిర్మాణాన్ని పరిశీలించారు. 1953లో తుంగభద్ర జలాశయాన్ని ప్రారంభించారు. 73 ఏళ్లు గడిచినా నేటికీ ఎక్కడా పగుళ్లు, లీకులు రాలేదు.తుంగభద్ర జలాశయం ఎడమ వైపున లెఫ్ట్ బ్యాంక్ మెయిన్ కెనాల్‌ను నిర్మించారు. ఇది 204 కిలో మీటర్ల దూరం వెళ్తూ, కొప్పళ, రాయచూరు జిల్లాలకు సాగు, తాగునీటిని అందిస్తోంది. ఈ కాలువ సామర్థ్యం 4 వేల 100 క్యూసెక్కులు. దీని కింద 2 లక్షల 43 వేల 900 హెక్టార్ల ఆయకట్టు సాగులోకి వచ్చింది. కుడివైపున కుడి ఎగువ కాలువ సున్నా కిలోమీటర్ల నుంచి ఏపీలోని అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ వరకు 105.43 కిలో మీటర్ల మేర ఉంటుంది. ఈ కాలువ సామర్థ్యం 4 వేల క్యూసెక్కులు.కర్ణాటకలో 80 వేల 908 హెక్టార్లు, ఏపీలో 76 వేల 937 హెక్టార్ల ఆయకట్టు దీని కింద సాగులోకి వస్తుంది. కుడి దిగువ కాలువ సున్నా కిలో మీటర్ల నుంచి కర్నూలు జిల్లా సరిహద్దు వరకు 250 కిలో మీటర్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత కర్నూలు-కడప కాలువగా ఆ జిల్లాల్లో సాగు, తాగునీటిని అందిస్తోంది. దీని కింద కర్ణాటకలో 37 వేల 503 హెక్టార్లు, ఆంధ్రప్రదేశ్‌లో 63 వేల 522 హెక్టార్ల ఆయకట్టు సాగులో ఉంది. మొత్తంగా జలాశయం పరిధిలోకి కర్ణాటకలో 9 లక్షల 26 వేల 824 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్‌లో 7 లక్షల 20 వేల 54 ఎకరాలు, తెలంగాణలో 87 వేల ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది.తుంగభద్ర జలాశయానికి పడమటి కనుమల్లో కురిసే వర్షాలే ఆధారం. ఏడాదిలో మొత్తం 230 టీఎంసీల వరద నీరు ఈ ప్రాజెక్టుకు వస్తుందని అంచనా. ఈ వరద నీటిలో కర్ణాటక 138.99 టీఎంసీలు, ఉమ్మడి ఏపీ 73.01 టీఎంసీలు కలిపి మొత్తం 212 టీఎంసీలు ఉపయోగించు కోవచ్చు. 18 టీఎంసీలు ఆవిరి, వృథా కింద లెక్కగట్టారు. తుంగభద్ర జలాశయం సామర్థ్యం 16 వందల 33 అడుగులు, 133 టీఎంసీలు. అయితే ప్రస్తుతం 104 టీఎంసీలకు సామర్థ్యం పడిపోయింది. సుమారు 29 టీఎంసీల పరిధి మేర పూడిక పేరుకుపోయింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com